క్లుప్తంగా

మెప్మా బజార్ ప్రారంభం



మెప్మా బజార్‌లో విక్రయిస్తున్న వివిధ రకాల వస్తువులు

ఆరిలోవ: ఎంవీపీ రైతుబజార్‌లో మెప్మా మార్కెట్ అందుబాటులోకి వచ్చింది. నెలలో రెండు రోజుల పాటు అందుబాటులో ఉండే ఈ బజార్‌ను ఆదివారం ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ప్రారంభించారు. డ్వాక్రా మహిళలు తయారు చేసిన అప్పడాలు, వడియాలు, చేగోడీలు, జంతికలు తదితర పిండి వంటలతోపాటు పచ్చళ్లు, వివిధ రకాల పళ్లు, అగరొత్తులు, కొవ్వొత్తులు, గాజులు, అంబ్రయిడరీ వస్తువులు, చేనేత వస్త్రాలు తదితర వాటిని విక్రయిస్తున్నారు. నెలలో రెండో శనివారం, ఆదివారం ఇక్కడ ఈ బజార్ అందుబాటులో ఉంటుందని మెప్మా అధికారులు తెలిపారు. కార్యక్రమంలో జోన్–3 కమిషనర్ ప్రసాద్, మెప్మా అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ దుర్గాప్రసాద్, రైతుబజార్ ఈవో జి.ప్రసాద్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

సాగరతీరంలో ‘స్వచ్ఛతా హీ సేవా’



ఆర్కే బీచ్ తీరంలో చెత్త సేకరిస్తున్న బుల్లయ్య కళాశాల విద్యార్థులు

మద్దిలపాలెం: డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాల ఇంజినీరింగ్ ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ఆదివారం ఆర్కే బీచ్‌లో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు బీచ్‌లో పేరుకుపోయిన చెత్తను తొలగించారు. ప్లాస్టిక్ బాటిళ్లు, ఇతర వ్యర్థాలను డస్ట్‌బిన్‌లో వేసి తీర ప్రాంతాన్ని శుభ్రం చేశారు.

నయనమనోహరంగా రాధాకృష్ణులు



ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు

కొమ్మాది: రాధా కృష్ణులు ప్రత్యేక అలంకరణలో నయనమనోహరంగా దర్శనమిచ్చారు. సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం వారాంతపు పూజా కార్యక్రమంలో భాగంగా హరేకృష్ణ, హరేరామ నామ స్మరణతో ప్రత్యేక పూజలు చేశారు. రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయ, నరసింహస్వామి విగ్రహాలను వివిధ వర్ణాల పుష్పాలతో చూడచక్కగా అలంకరించారు. స్వామివారి లీలలు, మహిమలను వర్ణిస్తూ భక్తులు భజనలు, గీతాలాపనలు చేశారు.

యువకుడిని రక్షించిన లైఫ్‌గార్డులు



యువకుడితో లైఫ్‌గార్డులు

కొమ్మాది: రుషికొండ బీచ్‌లో ఓ యువకుడు కొట్టుకుని పోతుండగా లైఫ్‌గార్డులు ప్రాణాలు కాపాడిన సంఘటన చోటు చేసుకుంది. మధురవాడకు చెందిన ఐదుగురు స్నేహితులు ఆదివారం సాయంత్రం బీచ్‌లో స్నానం చేసేందుకు సముద్రంలోకి దిగారు. అలల ఉధృతి ఎక్కువగా ఉండటంతో వీరిలో కె.హేమంత్ కొట్టుకునిపోతుండగా ఇక్కడ విధులు నిర్వహిస్తున్న లైఫ్ గార్డ్స్ చందు, అమ్మోరు, సతీష్ ఆ యువకుడిని గమనించి సురక్షితంగా తీరానికి తీసుకుని వచ్చారు. అతడికి మెరైన్ పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చి, ఇంటికి పంపించారు.

ఎట్టకేలకు మోక్షం

ఆధునిక భవనంలోకి ఆరిలోవ పోలీస్ స్టేషన్

- విమ్స్ ఆవరణలో రూ.6 కోట్లతో నిర్మాణం
- పోలీస్ సిబ్బంది, ఫిర్యాదుదారులకు తప్పనున్న ఇబ్బందులు
- త్వరలో ప్రారంభించనున్న అధికారులు



విమ్స్‌లో ఆవరణలో నిర్మించిన ఆరిలోవ పోలీస్ స్టేషన్ నూతన భవనం



వాష్‌రూమ్‌లు



కంట్రోల్ రూం(లాకప్)

ఆరిలోవ: ఆరిలోవ పోలీస్ స్టేషన్‌కు ఎట్టకేలకు మోక్షం కలగనుంది. దశాబ్దాలుగా ఇరుకు గదుల్లో విధులు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బందికి ఊరట లభించనుంది. హనుమంతవాక దరి విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(విమ్స్) ఆవరణలో సుమారు ఎకరా స్థలంలో ఆరిలోవ పోలీస్ స్టేషన్ కొత్త భవనం నిర్మించారు. దీని కోసం రూ.6 కోట్లు నిధులు కేటాయించారు. ఆధునిక సౌకర్యాలు కల్పించారు.

ప్రత్యేక విభాగాలు.. సకల సౌకర్యాలు

కొత్త పీఎస్‌లో హౌస్ ఆఫీసర్(సీఐ), సబ్ ఇన్‌స్పెక్టర్లు, ఏఎస్‌ఐలకు ప్రత్యేకంగా చాంబర్లు, రైటర్ రూం, రికార్డులు భద్రపరిచే గదులు, ఆఫీస్ రూం, సిబ్బందికి, అవసరాలు కోసం వెళ్లిన ప్రజలకు వాష్ రూమ్‌లు, నిందితుల కోసం పురుషులు, మహిళలకు వేర్వేరుగా కంట్రోల్ రూమ్‌లు(లాకప్‌లు), విశ్రాంతి గదులు, రిసెప్షన్ హాల్ తదితర విభాగాలు ప్రత్యేకంగా



కొత్త పోలీస్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న ద్వారకా ఏసీపీ రాంబాబు (ఫైల్)



మొదటి అంతస్తులో సీఐ, ఎస్ఐల చాంబర్లు

కేటాయించారు. సుమారు ఎకరం విస్తీర్ణం గల ఈ స్థలంలో 500 చదరపు గజాల భవన నిర్మాణం చేపట్టారు. సెల్లార్‌తోపాటు మొదటి అంతస్తులో సౌకర్యాలు కల్పించారు. మిగిలిన ఖాళీ స్థలాన్ని పార్కింగ్ తోపాటు దొంగతనాలకు, రోడ్డు ప్రమాదానికి గురైన వాహనాలు భద్రపరచడానికి వినియోగించనున్నారు.

ఉన్నతాధికారుల సందర్శన

తరుచూ ఉన్నతాధికారులు ఈ నిర్మాణాన్ని సందర్శించి పరిశీలిస్తున్నారు. శుక్రవారం ద్వారకా జోన్ ఏసీపీ రాంబాబు ఆరిలోవ ఎస్ఐ కృష్ణ, కానిస్టేబుళ్లతో కలిసి కొత్త భవనాన్ని సందర్శించారు. సీఐ, ఎస్ఐల చాంబర్లలో అవసరమైన కుర్చీలు, టేబుళ్లు ఏర్పాటు చేయించారు. అవసరమైన ఫర్నిచర్, కంప్యూటర్లు, వాటి టేబుళ్లు సిద్ధం చేయనున్నామని ఏసీపీ తెలిపారు. కొద్ది రోజుల్లో పోలీస్ స్టేషన్‌ను వినియోగంలోకి తీసుకొచ్చేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. దీనికి దారి కోసం బీఆర్‌టీఎస్ రహదారిని ఆనుకొని ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి పక్కన గెడ్డపై బ్రిడ్జి నిర్మించాల్సి ఉంది. బీఆర్‌టీఎస్ నుంచి నేరుగా స్టేషన్‌కు దారి ఏర్పాటు చేయనున్నారు.



ఆరిలోవలో ఇరుకు పోలీస్ స్టేషన్

ఇరుకు స్టేషన్‌లో విధులకు స్వస్తి

ప్రస్తుతం ఆరిలోవలోని పోలీస్ స్టేషన్ ఇరుగ్గా ఉంటుంది. సుమారు 100 చదరపు గజాల విస్తీర్ణంలో ఉన్న హాల్‌లో చిన్నచిన్న భాగాలుగా చేసి సీఐ చాంబర్, ఎస్ఐల టేబుళ్లు, రైటర్ టేబుల్, కంట్రోల్ రూం, రిసెప్షన్ తదితర వాటిని ఏర్పాటు చేశారు. కొన్నేళ్ల వరకు ఇక్కడ సిబ్బందికి, పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రజలకు మరుగుదొడ్ల సౌకర్యం కూడా లేదు. ఫిర్యాదుదారులు, స్థానికులతో నిత్యం ఈ స్టేషన్ రద్దీగా ఉంటుంది. ఇక్కడ సిబ్బంది సుమారు 50 మంది వరకు ఉన్నారు. వారిలో నిత్యం స్టేషన్‌లో అందుబాటులో ఉండేవారితో పాటు వివిధ అవసరాల నిమిత్తం వెళ్లే స్థానికులతో ఖాళీ ఉండదు. దీంతో స్టేషన్‌కు వెళ్లేవారు ఎక్కువ మంది గుంపులుగా రోడ్డు మీదే గడపాల్సి వస్తోంది. ఇప్పుడా సమస్య తీరనుంది. త్వరలో కొత్త స్టేషన్ ప్రారంభమైతే ఇక్కడి సిబ్బందికి ఇరుకు గదిలో విధుల నిర్వహణకు విముక్తి కలుగుతుంది. ఫిర్యాదుదారులు, స్టేషన్ వచ్చే స్థానికుల ఇబ్బందులు తొలగుతాయి.

3 నుంచి సాగర దుర్గ శరన్నవరాత్రి మహోత్సవాలు

నవరాత్రుల్లో పాతపోస్టాఫీస్ ఫెర్రీ నుంచి బోటు సౌకర్యం

అల్లిపురం: యారాడ కొండపై వెలసిన సాగర గిరి కనకదుర్గమ్మ అమ్మవారి శరన్నవరాత్రి మహోత్సవాలను అక్టోబర్ 3వ తేదీ నుంచి వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ఉత్సవ కమిటీ తెలిపింది. 3వ తేదీ ఉదయం 9.15 గంటలకు కలశ ప్రతిష్ఠ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అమ్మవారు రోజుకొక అవతారంలో భక్తులకు దర్శనమివ్వనున్నట్లు తెలిపారు. 3వ తేదీన బాల దుర్గాదేవిగా, 4న గాయిత్రి దేవిగా, 5న అన్నపూర్ణదేవిగా, 6న భువనేశ్వరిదేవిగా, 7న రాజరాజేశ్వరిదేవిగా, 8న లలితాదేవిగా, 9న సరస్వతిదేవిగా, 10న శాకాంబరి దేవిగా, 11న చండీదేవిగా, 12న సాగర గిరి కనకదుర్గదేవిగా భక్తులకు దర్శనం ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రతి రోజు ఉదయం 4.45 గంటలకు అమ్మవారికి పంచామృతాభిషేకాలు, పండ్ల రసాలు, సుగంధ ద్రవ్యాలతో



సాగర గిరి కనకదుర్గమ్మ

అభిషేకం నిర్వహిస్తామన్నారు. ఉదయం 7 గంటలకు ప్రథమపూజ, బాలభోగం నుంచి సాయంత్రం 6.30 గంటలకు పంచనేత్ర, నక్షత్ర హారతితో పూజాధికాలు ముగుస్తాయన్నారు.

బోటు సౌకర్యం..

అమ్మవారిని తొమ్మిదరోజుల పాటు దర్శించుకునే నిమిత్తం పాతపోస్టాఫీసు దరి ఫెర్రీ నుంచి యారాడ కొండ వరకు బోటు సౌకర్యం ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ సౌకర్యం ఉంటుందన్నారు. విశాఖ నగర ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఉత్సవ కమిటీ సభ్యులు కోరారు.

శ్మశానవాటిక శుభ్రం



పాత వెంకోజీపాలెం శ్మశానవాటికను శుభ్రం చేస్తున్న సంఘ సభ్యులు

మద్దిలపాలెం: జీవీఎంసీ 15వ వార్డులో గ్రామ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం నిర్వహించారు. పాత వెంకోజీపాలెం శ్మశానవాటికలో సంఘ సభ్యులు తుప్పలు, చెత్తను తొలగించి దారిని శుభ్రం చేశారు. జీవీఎంసీ తరఫున మినీ బాబ్‌కాట్‌తో వాటికను శుభ్రం చేయించారు.

సాగర్‌నగర్‌లో పెట్రోల్ దొంగల హల్‌చల్

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు సాగర్‌నగర్‌లో పెట్రోల్ దొంగలు రెచ్చిపోతున్నారు. రాత్రి సమయాల్లో ఇంటి ముందు పార్క్‌చేసిన ద్విచక్ర వాహనాల్లో పెట్రోల్‌ను దొంగిలిస్తున్నారు శనివారం అర్ధరాత్రి ఓ ఇంటి వద్ద ఓ యువకుడు పెట్రోల్ దొంగిలిస్తూ సీసీ ఫుటేజీకు చిక్కాడు. పోలీసులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

అంకోసా నూతన కార్యవర్గం



అంకోసా నూతన కార్యవర్గ సభ్యులు

మహారాణిపేట: ఆంధ్రా మెడికల్ కాలేజీ ఓల్డ్ స్టూడెంట్ అసోసియేషన్(ఎ.ఎం.సి.ఒ.ఎస్.ఎ.) నూతన కార్యవర్గం కొలువుదీరింది. ఆదివారం సాయంత్రం జిల్లా పరిషత్ వద్ద ఉన్న అంకోసాలో పాత కార్యవర్గం నుంచి కొత్త కార్యవర్గం పదవీ బాధ్యతలు స్వీకరించింది. అధ్యక్షుడిగా డాక్టర్ ఎస్.కె.ఇ.అప్పారావు, కార్యదర్శిగా డాక్టర్ పి.వి.సుధాకర్, కోశాధికారిగా డాక్టర్ ఐ.వాణిత తదితరులు ఎన్నికయ్యారు. వీరిని వైద్యులు వి.చంద్రశేఖరం, ఎస్.వి.ఆదినారాయణ, టి.రవిరాజ్, ఇ.పెదవీర్రాజు, కె.వెంకటేశ్వర్లు, జి.టి.వి.రమేష్ తదితరులు అభినందించారు. పాత కార్యవర్గ అధ్యక్షురాలు డాక్టర్ ఆర్.శశిప్రభ, కార్యదర్శి డాక్టర్ రామ్మూర్తి తదితరులు దగ్గర ఉండి నూతన కార్యవర్గానికి బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గానికి అభినందనలు తెలిపారు.

ముగిసిన చిత్రలేఖన, వ్యాసరచన పోటీలు

మద్దిపాలెం : ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి సహకారంతో గ్రీన్ క్లైమేట్ టీం ఎన్‌జీవోస్ నిర్వహించిన వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు విజయవంతంగా ముగిశాయి. జీవీఎంసీ 50వ వార్డు మురళీనగర్ జీఆర్ ఫంక్షన్ హాలులో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కృష్ణా యూనివర్సిటీ విశ్రాంత ఉప కులపతి సుంకరి రామకృష్ణారావు మాట్లాడారు. విద్యార్థులు సేవాదృక్పథం అలవరచుకోవాలని సూచించారు. స్వచ్ఛతా హీ సేవా – 2024పై విద్యా సంస్థల్లో కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు రీజినల్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ పి.వి.ముకుందరావు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలు భవిష్యత్‌లో విద్యా సంస్థల్లో నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త టీఎస్ఆర్ శ్రీనివాస్, డ్రాయింగ్ టీచర్ మోహన్, గ్రీన్ క్లైమేట్ టీం ఎన్‌జీవోస్ వ్యవస్థాపక కార్యదర్శి జేవీ రత్నం తదితరులు పాల్గొన్నారు.



చిత్రాలు ప్రదర్శిస్తున్న చిన్నారులతో నిర్వాహకులు

ఎండాడ హైస్కూల్ వద్ద గస్తీ ఏర్పాటు

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు ఎండాడ జిల్లా పరిషత్ హైస్కూల్ వద్ద ఆరిలోవ పోలీసులు గస్తీ ఏర్పాటు చేశారు. రాత్రి సమయాల్లో కొందరు ఆకతాయిలు పాఠశాలలోకి ప్రవేశించి విద్యుత్ వైర్లు, ఇతర సామాగ్రి ధ్వంసం చేస్తున్నందున.. వాటిని అరికట్టేందుకు పోలీసులు పహారా కాస్తున్నారు. అనుమానితులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని తెలిపారు.



పాఠశాల వద్ద గస్తీ కాస్తున్న పోలీస్

● తీరంలో పడిపోయిన హెచ్చరిక బోర్డులు





సాగర తీరంలో సందర్శకులను అప్రమత్తం చేసేందుకు ఏర్పాటు చేసిన ప్రమాద హెచ్చరిక బోర్డులు కిందపడిపోయాయి. ఇటీవల కురిసిన వర్షాలకు ఈ బోర్డులు నేలకొరిగి సముద్రంలోకి కొట్టుకుపోయే స్థితికి చేరినా.. సంబంధిత అధికారులు పట్టించుకోలేదు.

– ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

వ్యాయామం, యోగాతో గుండె పదిలం



బీచ్ రోడ్డులో బెలూన్లు ఎగురవేసి అవగాహన ర్యాలీ ప్రారంభిస్తున్న వైద్యులు

ఎంవీపీకాలనీ: స్థానిక మెడికవర్ ఆస్పత్రిలో ఆదివారం ప్రపంచ గుండెజబ్బుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హాస్పిటల్ సెంటర్ హెడ్ డాక్టర్ అరుణ్‌కుమార్, సీనియర్ కార్డియాలజీ డాక్టర్లు కరుణాకర్ పాడి, డాక్టర్ హేమంత్‌కుమార్ బెహరాలు మాట్లాడుతూ శరీరంలో అత్యంత ముఖ్యమైన అవయవం గుండెను పదిలంగా, ఆరోగ్యకరంగా చూసుకోవాలన్నారు. ఇందుకోసం ప్రతి రోజూ వ్యాయామం, యోగా వంటివి చేయాలని, మానసిక ఒత్తిడికి దూరంగా ఉండాలని సూచించారు. తేలికపాటి యోగాసనాలతో గుండెను దృఢం చేసుకోవచ్చన్నారు. ప్రస్తుతం గుండె చికిత్సలకు ఆధునిక వైద్యం ఎంవీపీ కాలనీ మెడికవర్ ఆస్పత్రిలో అందుబాటులో ఉందని తెలిపారు. బీచ్ రోడ్డులో ఉదయం ఆస్పత్రి వైద్యులు, ఉద్యోగులు హెల్తీ హార్ట్ థీమ్‌తో 2 కిలోమీటర్ల అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మెడికవర్ కార్డియాలజీ బృందం, రీజినల్ సూపరింటెండెంట్ నరేంద్ర బెండి తదితరులు పాల్గొన్నారు.

రామశర్మకు బాలి స్మారక పురస్కారం



రామశర్మకు పురస్కారం అందిస్తున్న అతిథులు

సీతంపేట: విశాఖ సంస్కృతి ఆధ్వర్యంలో చిత్రకారుడు, కార్టూనిస్ట్ బాలి(మేడిశెట్టి శంకరరావు) జయంతి సభ ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో నిర్వహించారు. సభాధ్యక్షుడు శిరేల సన్యాసిరావు మాట్లాడుతూ బాలితో తనకు గల పరిచయం, అనుభవాలు, బాలి చిత్రకళా నైపుణ్యం వివరించారు. అనంతరం కొచ్చెర్లకోట సత్యనారాయణ చేతుల మీదుగా ప్రముఖ కార్టూనిస్ట్ పార్నంది వెంకట రామశర్మకు బాలి స్మారక పురస్కారం అందజేసి ఘనంగా సత్కరించారు. బాలి కుమార్తె మేడిశెట్టి వైశాలి రూ.5 వేలు నగదు పురస్కారం అందజేశారు. పురస్కార గ్రహీత రామశర్మ మాట్లాడుతూ బాలు స్మారక పురస్కారం అందుకోవడం చాలా ఆనందంగా ఉందని, కార్టూన్స్ గీయడంలో తనకు బాలి ఆదర్శమని పేర్కొన్నారు. కార్యక్రమంలో మేడా మస్తాన్‌రెడ్డి, అడపా రామకృష్ణ, ఆర్.వి.రమణమూర్తి, వెలమల సిమ్మన్న, చలపతిరావు, సరోజ, ఎస్.హనుమంతరావు పాల్గొన్నారు.

10 కిలోల గంజాయి పట్టివేత

సీతమ్మధార: ఇతర రాష్ట్రాలకు గంజాయి తరలిస్తున్న ముగ్గురు సభ్యుల ముఠాను ద్వారకా జోన్ పోలీస్‌లు అరెస్ట్ చేశారు. ఒడిశాకు చెందిన అజయ్ కుమార్, నందుకోహరా, చంద్రపంగి కలిసి బెంగళూర్‌కు గంజాయి తరలించేందుకు రామాటాకీస్ దరి కంటి ఆస్పత్రి వద్దకు ఆదివారం చేరుకున్నారు. వారి కదలికలు అనుమానాస్పదంగా ఉండటంతో పోలీసులు బ్యాగులు తనిఖీ చేయగా రెండు ప్యాకెట్ల గంజాయి ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. సీఐ డి.వెంకటరమణ నేతృత్వంలో ఎస్ఐ శ్రీను కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మూసుకుపోతున్న ముడసర్లోవ రోడ్లు

● దట్టంగా పెరిగిన ముళ్ల చెట్లు

ఆరిలోవ: ముడసర్లోవ రిజర్వాయర్ వెనుక రోడ్లు ముళ్ల పొదలు, డెబ్రిస్‌తో మూసుకుపోతున్నాయి. ఒక పక్క గృహ వ్యర్థాలతో ఇక్కడి రోడ్లు ఇరుగ్గా మారగా.. మరో పక్క ఇరువైపులా దట్టంగా పెరిగిన ముళ్ల పొదలు ఆ దారులను కప్పేస్తున్నాయి. దీంతో ఈ రోడ్లు సొరంగంలా కనిపిస్తున్నాయి. ముడసర్లోవ రిజర్వాయర్ వెనుక డంపింగ్ యార్డు ఉంది. దీని పక్క నుంచి గతంలో నిర్వహించిన ప్రభుత్వ ఇసుక స్టాక్ పాయింట్ వైపు వెళ్లే రోడ్లన్నీ సుమారు కిలోమీటర్‌కు పైగా ముళ్ల తుప్పలు, డెబ్రిస్‌తో మూసుకుపోయాయి. ఈ రోడ్లపై అటుగా వెళ్లడానికి వీలుపడటం లేదు. జన సంచారం లేని ఈ ప్రాంతం నిర్మానుష్యంగా మారి అసాంఘిక కార్యకలాపాలకు నిలయమైంది. ఇదే అదునుగా చేసుకొని మందుబాబులు, గంజాయి బాబులు ఈ ప్రాంతాన్ని డెన్‌లుగా మార్చేశారు. తుప్పల చాటున దర్జాగా గుంపులుగా కూర్చొని గంజాయి సేవించడం, మద్యం తాగడం చేస్తూ ఊగిపోతున్నారు. సాధారణంగా ఇక్కడి రోడ్లపై ఎక్కువగా వాహన చోదకులు ఉండరు. దీంతో కార్లు, ద్విచక్ర వాహనాల డ్రైవింగ్ నేర్చుకోవడానికి ఈ రహదారులు ఉపయోగపడేవి. ప్రస్తుతం డెబ్రిస్, ముళ్ల తుప్పలతో మూసుకుపోయిన ఈ రోడ్లపై కొన్నాళ్లుగా డ్రైవింగ్‌కు కూడా ఉపయోగపడటం లేదు. ఇక్కడి విశాలమైన రహదారులను శుభ్రం చేసి వినియోగంలోకి తీసుకురావాలని అధికారులను స్థానికులు కోరుతున్నారు.





ముడసర్లోవ రిజర్వాయర్ వెనుక ఇరువైపులా ముళ్ల చెట్లతో మూసుకుపోయిన డబుల్ రోడ్డు



డెబ్రిస్‌తో నిండిన రహదారి

ఉత్సాహంగా స్టోరీ టెల్లింగ్



పిల్లలకు కథ చెబుతున్న స్టోరీ టెల్లర్ సీత

సీతంపేట: విశాఖ పబ్లిక్ లైబ్రరీ, భారతీయ విద్యాభవన్ స్కూల్ సంయుక్తంగా పౌర గ్రంథాలయంలోని మియావాకి సెంటర్‌లో ఆదివారం నిర్వహించిన స్టోరీ టెల్లింగ్ ఉత్సాహంగా సాగింది. స్టోరీ టెల్లర్ సీత తనదైన శైలిలో పిల్లలకు చక్కని కథలు చెప్పి ఆకట్టుకున్నారు. ఈశాన్య భారతదేశంలోని గారోస్ తెగ సంప్రదాయ కథలను పిల్లలకు పరిచయం చేశారు. సంగీత వాయిద్యాలు, కళాకృతుల మేళవింపుతో కథకు జీవం పోశారు. క్రాఫ్ట్ యాక్టివిటీలో భాగంగా బాలలు పేపర్‌తో నెమలి బొమ్మలు తయారు చేశారు. వివిధ పాఠశాలకు చెందిన సుమారు 60 మంది విద్యార్థులు పాల్గొన్నారు.